# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **శ్రీసత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు పాల్గొంటారు.**
2. **నీటి సంరక్షణకు గాను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు 6వ జాతీయ జల అవార్డులు, జల్ సించాయ్.. జన్ భాగీదారి పురస్కారం లభించింది.**
3. **విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కార్గో రవాణా కార్యకలాపాలను పునరుద్ధరించామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.**
4. **అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్ తెలిపారు.**
5. **అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు.**

==========================

పుట్టపర్తిలో జరిగే శ్రీసత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు. రేపు ఢిల్లీ నుంచి బయలుదేరి సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారు.. అక్కడి నుంచి సాయి కుల్వంత్ సభ మందిరం చేరుకొని సత్య సాయి మహాసమాధి దర్శించుకుంటారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియం చేరుకొని అక్కడ జరిగే సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో పాల్గొంటారు. తర్వాత తమిళనాడుకు వెళ్ళనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్ మాట్లాడుతూ,

వాయిస్... 27 సెకన్లు

---------------------------

నీటి సంరక్షణకు చేసిన కృషికి గాను దేశంలోని వివిధ జిల్లాల అధికారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు 6వ జాతీయ జల అవార్డులు, జల్ సించాయ్.. జన్ భాగీదారి పురస్కారాలను ప్రదానం చేశారు. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నీటి సంరక్షణకు అమలు చేసిన కార్యక్రమాలకు గాను పురస్కారాన్ని అందుకుంది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 5 వేలకు పైగా భూగర్భ జలాల వనరులను సంరక్షించడంతో

జిల్లా ఈ అవార్డుకు ఎంపికైంది.

---------------------------

ప్రధానమంత్రి కిసాన్–అన్నదాతా సుఖీభవ రెండవ విడత నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేపు విడుదల చేయనున్నాయి. రైతుల ఖాతాల్లోకి కేంద్రప్రభుత్వం 2 వేల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 5 వేల రూపాయల చొప్పున జమ చేయనున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురంలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిధులు విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 46.86 లక్షల మంది రైతుల ఖాతాలకు 7 వేల రూపాయల చొప్పున మొత్తం 3,135 కోట్ల రూపాయలు జమ చేయనున్నామని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు పాల్గొననున్నారు. నిధుల విడుదల కార్యక్రమాన్ని రాష్ట్రంలోని రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారుల్ని ఆదేశించారు.

---------------------------

విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కార్గో రవాణా కార్యకలాపాలను పూర్తిగా పునరుద్ధరించామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖ విమానాశ్రయంలో అంతర్జాతీయ ఎయిర్ కార్గో ఆపరేషన్స్ రీస్టార్ట్ ప్రోగ్రామ్‌ను ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమ విధానంలో ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, విమానయాన పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన అంశాలలో కార్గో సదుపాయాలు ఒకటిని అన్నారు. విమానాశ్రయం కార్గో కార్యకలాపాలను ప్రారంభించడం ద్వారా విశాఖపట్నం నుండి అంతర్జాతీయ వాణిజ్య ఎగుమతులకు గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పరిశ్రమలశాఖ మంత్రి టీ.జీ. భరత్ అన్నారు. కర్నూలు జిల్లా జగన్నాథగుట్టలో నిర్మాణాలు పూర్తయిన టిడ్కో గృహాల పట్టాలను మంత్రి నిన్న లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్.. 29 సెకన్లు

---------------------------

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు –ఎంఎస్ఎంఈల ద్వారా స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. చిత్తూరుజిల్లా పూతలపట్టులో ఎంఎస్ఎంఈల ద్వారా నూతనంగా ఏర్పాటైన రెండు చిన్నతరహా పరిశ్రమలను ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం ప్రసాదరావు మాట్లాడుతూ, చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఔత్సాహికులైన వారు పరిశ్రమల ఏర్పాటుకు ధరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. వారిలో అర్హులైన వారికి ప్రభుత్వం రాయితీ కింద రుణాలను అందిస్తుందన్నారు.

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు–మావోయిస్టుల మధ్య

జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య అనుచరులు ఉన్నారని, ఈరోజు ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

---------------------------

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంత్యోత్సవాలలో భాగంగా రేపు నరసారావు పేటలో ఐక్యతా మార్చ్ ను నిర్వహించనున్నామని మై భారత్ ఉమ్మడి గుంటూరు జిల్లా ఉప సంచాలకులు డి.కిరణ్మయి తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో సర్దార్ @150 పేరుతో నిర్వహించే జిల్లా స్థాయి యూనిటీ మార్చ్ కార్యక్రమంపై ఆమె నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, భారతవని ఒకే దేశంగా మార్చిన సర్దార్ పటేల్ నాయకత్వ ఆదర్శాలను యువత అనుసరించేలా ప్రేరేపించడమే ఈ కార్యక్రమ లక్ష్యం అని అన్నారు. మేరా యువ భారత్ నేతృత్వంలో నిర్వహిస్తున్న యూనిటీ మార్చ్ కార్యక్రమంలో యువత, విద్యార్థులు పాల్గొనాలని ఆమె కోరుతూ,

వాయిస్.. 31 సెకన్లు

---------------------------

అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే 20 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 08539 నెంబర్ కలిగిన విశాఖ–కొల్లాం వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు నుంచి జనవరి 20వ తేదీ వరకు ప్రతీ మంగళవారం ఉదయం 8 గంటల 20 నిమిషాలకు విశాఖలో బయల్దేరి బుధవారం మధ్యాహ్నం కొల్లాం చేరుకుంటుందని తెలిపారు. అలాగే 08540 నెంబర్ కలిగిన కొల్లాం–విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్ రేపటి నుంచి జనవరి 21వ తేదీ వరకు ప్రతీ బుధవారం సాయంత్రం 5 గంటలకు కొల్లాంలో బయల్దేరి గురువారం రాత్రికి విశాఖపట్నం చేరుకుంటుందన్నారు. ఈ రైళ్లు ఆంధ్రప్రదేశ్ లోని దువ్వాడ, సామర్లకోట, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 22వ తేదీన అల్పపీడనం ఏర్పడనుందని, ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

=====================